జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 106॥ గురువారం ॥ 10-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



10 సెప్టెంబర్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:19 తిథి చతుర్దశి ఉ. 10:35 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం మఖ మ. 2:03 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం సిద్ధ రా. 7:13 వరకు కరణం శకుని ఉ. 10:35 వరకు చతుష్పాద రా. 9:45 వరకు వర్జ్యం రా. 9:48 నుండి రా. 11:21 వరకు దుర్ముహూర్తం ఉ. 10:11 నుండి ఉ. 10:59 వరకు మ. 3:03 నుండి మ. 3:52 వరకు రాహుకాలం మ. 1:44 నుండి మ. 3:16 వరకు యమగండం ఉ. 6:07 నుండి ఉ. 7:38 వరకు గుళికాకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:41 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 11:46 నుండి మ. 1:17 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:37 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# సిద్ధార్థ్‌కు ప్రియారిటీ



## విజయవాడ మేయర్ అభ్యర్థిగా ప్రాధాన్యం

## నారా లోకేష్‌తో బొండా ఉమా, సిద్ధార్థ్ భేటీ

## 40 నిమిషాల పాటు సాగిన చర్చ

విజయవాడ, సెప్టెంబర్ 9: విజయవాడ నగర అభివృద్ధికి యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నట్లు ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. విజయవాడ మేయర్ అభ్యర్థి ఎంపిక సమయంలో తన తనయుడు బొండా సిద్ధార్థ్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఉండవల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నివాసంలో మంత్రి నారా లోకేష్‌తో బొండా ఉమామహేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బొండా సిద్ధార్థ్ సమావేశమయ్యారు. సుమారు 40 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో విజయవాడ నగర అభివృద్ధి, మేయర్ అభ్యర్థిత్వం తదితర అంశాలపై చర్చించినట్లు తరువాయి 2 వ పేజీలో..



# కాళోజీకి సీఎం ఘన నివాళులు

## జయంతి సందర్భంగా పుష్పాంజలి ఘటింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 : ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి (మిగతా 2వ పేజీలో)



# గవర్నర్‌కు ప్రభుత్వ దౌర్జన్యాలను వివరించాం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

## శాసనసభ తొలి రోజు జరిగిన ఘటనలపై గవర్నర్‌కు ఫిర్యాదు

## మహిళా ఎమ్మెల్యేలపై దాడుల ఆధారాలు సమర్పించామని వెల్లడి

## అవసరమైతే జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామని స్పష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 9 : లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇటీవల శాసనసభ సమావేశాల తొలి రోజు కాంగ్రెస్ ప్రభుత్వం (మిగతా 2వ పేజీలో)



# దళితులకు న్యాయం జరగాలి

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

## అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై విమర్శలు

## దళితుల పట్ల అవమానకర వైఖరిని ఖండన

## బలహీన వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 9 : దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించిన వారే ఇప్పుడు (మిగతా 2వ పేజీలో)




# ఆర్థిక రంగ భవిష్యత్తుకు దిశానిర్దేశం

## గ్లోబల్ ఫిన్ టెక్ ఫెస్ట్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

## ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్కమ్ స్పీచ్, కీలక నేతల హాజరు

## ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీలపై ప్రత్యేక ఫోకస్

ఇన్నోవేషన్, ఇంక్లూజన్, ఇంపాక్ట్ ద్వారా ఆర్థిక రంగ భవిష్యత్తును తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 7వ గ్లోబల్ ఫిన్ టెక్ ఫెస్ట్ 2026 ముంబయిలో ప్రారంభమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఫెస్ట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా, క్రిస్ గోపాలకృష్ణన్ తో పాటు గ్లోబల్ ఫిన్ టెక్ ఎకోసిస్టమ్ కు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రారంభ సెషన్‌లో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్కమ్ స్పీచ్ ఇచ్చారు.

ముంబయి, సెప్టెంబర్ 09: ఫిన్ టెక్ రంగం సాధించిన ప్రగతిని, భవిష్యత్తులో ఉన్న అవకాశాలను ఆయన వివరించారు. డిజిటల్ ఫైనాన్స్ విస్తరణ, ఫైనాన్షియల్ ఇంక్లూజన్ లో టెక్నాలజీ పాత్ర కీలకంగా మారిందని పేర్కొన్నారు. గ్లోబల్ స్థాయిలో భారత ఫిన్ టెక్ ఎకోసిస్టమ్ సాధించిన గుర్తింపును ప్రస్తావించారు. ఈ ఏడాది ఫెస్ట్ థీమ్ గా పొటెన్షియల్ టు ఇంపాక్ట్: ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటమ్ - ట్రస్టెడ్, కనెక్టెడ్, తరువాయి 2 వ పేజీలో..



# శ్రీలంక అధ్యక్షుడితో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ భేటీ

## కొలంబోలో అనుర కుమార దిస్సానాయకేతో సమావేశం

## ప్రాంతీయ శాంతి, భద్రతకు కలిసి పనిచేయాలని నిర్ణయం

కొలంబో, సెప్టెంబర్ 9 : కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయకేతో కొలంబోలో సమావేశమయ్యారు. ఈ సమావేశం అత్యంత స్నేహపూర్వకంగా, ఫలవంతంగా సాగిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ తరఫున శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు శ్రీలంక ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. (మిగతా 2వ పేజీలో)

# దోషులపై కఠిన చర్యలు



## శాసనసభ ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశం

## క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వ నిర్ణయం

## స్పీకర్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ

శాసనసభ వర్షాకాల సమావేశాల తొలి రోజు సెప్టెంబర్ 6న చోటుచేసుకున్న సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి జరిగిన అనుచిత వ్యాఖ్యలు, ఇతర పరిణామాలపై సభలో సుదీర్ఘ చర్చ అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. స్పీకర్‌ను అవమానించేలా జరిగిన ఘటనలపై యావత్ శాసనసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. సభాపతి స్థానానికి జరిగిన అవమానం మొత్తం శాసనసభకు జరిగిన అవమానంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9 : స్పీకర్‌కు ప్రభుత్వం, శాసనసభ పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సంఘటనల్లో పాల్గొన్న వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి హెచ్చరిం చారు. ఉద్దేశపూర్వకంగా కొందరు వ్యక్తులు సభా గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. అధికా రులపై దాడులు చేయడమే కాకుండా సభాపతి స్థానాన్ని కించపరిచే చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. మహిళల ను గౌరవించే సంస్కృతి ఉన్న సమాజంలో ఒక తల్లిని అవమానించేలా (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం:** వ్యాపారమున సొంత నిర్ణయాలతో లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం పొందుతారు.చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. బంధువులతో విభేదాలు తొలగుతాయి.

**వృషభం:** ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. మిత్రులతో వివాదాలు మానసికంగా చికాకుగా కలిగిస్తాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో కొంత అసంతృప్తి తప్పదు. ముఖ్యమైన వ్యవహారాలలో కష్టించినా ఫలితం కనిపించదు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు ఉంటాయి.

**మిధునం:** వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా కొన్ని నిర్ణయాలు మార్చుకుంటారు. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమవుతుంది. చేపట్టిన పనులలో కష్టానికి తగిన ఫలితం లభించదు. కుటుంబ వ్యవహారాల్లో తొందరపాటు పడకూడదు.

**కర్కాటకం:** స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారమున అంచనాలు అందుకుంటారు. ఉద్యోగాలలో సమస్యలు తీరుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొన్ని పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**సింహం:** ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. బంధువుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సానుకూలమవుతాయి. భాగస్వామితో శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్ధిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి.

**కన్య:** ఉద్యోగమున ఉన్నతాధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. విద్యార్థుల శ్రమ ఫలించదు. చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. బంధువర్గంతో వివాదాలు తప్పవు.

**తుల:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు. బంధువులతో అకారణ వివాదాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఉంటాయి. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

**వృశ్చికం:** పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

**ధనస్సు:** సోదరులతో స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. సన్నిహితులతో మాట పట్టింపులు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

**మకరం:** విలువైన వస్తు వాహన లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. స్థిరాస్తి క్రయవిక్రయాలలో నూతన లాభాలను అందుకుంటారు.

**కుంభం:** వ్యాపార ఉద్యోగాలలో ఊహించని సమస్యలు తప్పవు. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యులతో విభేదాలు తప్పవు. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

**మీనం:** వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కొత్త వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి.





## సిద్ధార్థ్‌కు ప్రియారిటీ

(మొదటి పేజీ తరువాయి)

బొండా ఉమా తెలిపారు. విజయవాడ మేయర్ పదవిని ఇప్పటివరకు కాపు సామాజిక వర్గానికి ఇవ్వలేదని, మేయర్ అభ్యర్థి ఎంపిక సమయంలో బొండా సిద్ధార్థ్‌ను తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని లోకేష్ చెప్పినట్లు బొండా ఉమా పేర్కొన్నారు. తన తనయుడు సిద్ధార్థ్ సుమారు 15 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారని, పార్టీ పిలుపునిచ్చిన వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ యువతను పెద్ద ఎత్తున పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంలో కీలకంగా వ్యవహరించారని బొండా ఉమా తెలిపారు. 2023లో చంద్రబాబునాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా అమెరికాలో ప్రవాస భారతీయులతో కలిసి నిరసన కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. 'బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ', సభ్యత్వ నమోదు, సైకిల్ యాత్ర, ఇంటింటికీ తెలుగుదేశం తదితర కార్యక్రమాల్లోనూ సిద్ధార్థ్ చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పీ4' కార్యక్రమం స్ఫూర్తితో పేద, మధ్యతరగతి కుటుంబాలకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందించారని చెప్పారు. విద్యార్థుల పాఠశాల ఫీజుల చెల్లింపు, కుట్టుమిషన్లు, అల్పాహార బండ్లు, తోపుడు బండ్లు, చెరకు రసం యంత్రాలు తదితరాలను అందించి పలువురికి స్వయం ఉపాధి కల్పించేందుకు కృషి చేశారని వివరించారు. విజయవాడ నగరాన్ని మరింత అభివృద్ధి చేయడం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపడం, యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం తన లక్ష్యమని బొండా సిద్ధార్థ్ తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకంతో అవకాశం కల్పిస్తే విజయవాడ నగర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

## గవర్నర్‌కు ప్రభుత్వ దౌర్జన్యాలను వివరించాం

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో పోలీసులు తమపై ప్రదర్శించిన దౌర్జన్యాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో వ్యక్తం చేసిన నిరసన తరహాలోనే టీ-షర్ట్ల ద్వారా నిరసన తెలపాలని భావించిన తమను శాసనసభలోకి అనుమతించకుండా రోడ్డుపైనే అడ్డుకున్నారని ఆరోపించారు. తమపై జరిగిన దాడులు, ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనలకు సంబంధించిన ఫొటోలు, ఇతర ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు కేటీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ మహిళా నేత సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును కూడా వివరించామని తెలిపారు. తమపై దాడులు జరిగాయని ఫిర్యాదులు చేసినప్పటికీ పోలీసులు స్పందించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తమపై దాడి చేసి తిరిగి తమనే అపవాదులు మోపుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ ఇంటి వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్లి ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారని, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేశారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ ఘటనల వెనుక రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఉందని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ శాసనసభ, శాసనమండలిలోకి తమను అనుమతించలేదని, రాజ్యాంగ సంస్థలు, న్యాయస్థానాల పట్ల ప్రభుత్వానికి గౌరవం లేదని గవర్నర్‌కు వివరించినట్లు కేటీఆర్ తెలిపారు. ఇదే కారణంగా తమను సస్పెండ్ చేశారని ఆరోపించారు. స్పీకర్‌పై తమకు పూర్తి గౌరవం ఉందని, అయితే కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని వాడుకుంటోందని కేటీఆర్ అన్నారు. జరగని విషయాలను జరిగినట్లుగా చిత్రీకరిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరగాలని కోరినట్లు తెలిపారు. తాము ప్రస్తావించిన ప్రతి అంశంపై విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారని కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణలో న్యాయం జరగకపోతే జాతీయ మహిళా కమిషన్‌ను కూడా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం విడుదల చేసినట్లు చెబుతున్న ఏఐ ఫొటోలు, వీడియోలపై ఇప్పటికే ఫిర్యాదు చేశామని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దోషులపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రవర్తించడం అత్యంత దురదృష్టకరమని ముఖ్యమంత్రి అన్నారు. తల్లిని, మహిళను శక్తి స్వరూపిణిగా భావించే భారతీయ సంస్కృతికి విరుద్ధంగా ఈ చర్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి ప్రవర్తన సమాజం అంగీకరించదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపేందుకు అనేక మార్గాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత అవమా నాలకు దిగడం సరైంది కాదని సీఎం అభిప్రాయపడ్డారు. సభాపతి మనోభావాలను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొన్ని వ్యాఖ్యలు చేసినట్లు కనిపిస్తోందని అన్నారు. చట్టపరంగా దోషులను శిక్షించే విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం శాసన సభలో ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాలని భావిం చిందని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య, ధరణి, 22(ఎ) తదితర కీలక అంశాలతో పాటు ప్రతిపక్షాలు లేవనెత్తిన పలు విషయాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని పరిణామాల కారణంగా ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డంకులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు.

## శ్రీలంక అధ్యక్షుడితో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

భారత్, శ్రీలంక మధ్య ఉన్న సాంస్కృతిక, చారిత్రక సంబంధాలను ఇరు నాయకులు గుర్తు చేసుకున్నారు. నాగరికత పరంగా సోదర దేశాలుగా, సమీప పొరుగు దేశాలుగా, సముద్ర భాగస్వాములుగా రెండు దేశాలు కలిసి ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. పరస్పర సహకారంతో అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, వాణిజ్య సంబంధాల బలోపేతంపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వివిధ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగించాలని నిర్ణయించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రత, శాంతి, స్థిరత్వం అంశాలపై కూడా చర్చ జరిగింది. సముద్ర భద్రత, ప్రాంతీయ సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఇరు పక్షాలు గుర్తించాయి. ప్రాంతీయ సవాళ్లను ఎదుర్కోవడంలో కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. భారత్, శ్రీలంక మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు మరింత బలపడుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పరస్పర గౌరవం, విశ్వాసం ఆధారంగా రెండు దేశాలు వివిధ రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించుకుంటున్నాయని తెలిపారు. ఈ సమావేశం ద్వైపా క్షిక సంబంధాలకు కొత్త ఊతం ఇస్తుందని భావిస్తున్నారు. ప్రాంతంలో శాంతి, భద్రత, అభివృద్ధి, శ్రేయస్సు కోసం భారత్, శ్రీలంక సంయుక్తంగా పనిచేయాలని సమావేశంలో పునరుద్ఘాటించారు. ప్రజల సంక్షేమం, దేశాల అభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకారాన్ని మరింత పెంచుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశం ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలను మరోసారి ప్రతిబింబించింది.

## కాళోజీకి సీఎం ఘన నివాళులు

(మొదటి పేజీ తరువాయి)

ఘటించి ఘన నివాళులు అర్పించారు. కాళోజీ సాహిత్య, సామాజిక సేవలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులర్పించారు. తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య అభివృద్ధికి కాళోజీ అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ప్రతిబింబిస్తూ సామాజిక చైతన్యానికి కాళోజీ విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. తెలంగాణ మాండలిక భాషకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో కాళోజీ పాత్ర విశేషమని తెలిపారు. ఆయన రచనలు నేటికీ యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, మానవ విలువల కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు ఆదర్శమని అన్నారు. కాళోజీ జీవితం ప్రజల కోసం అంకితమైనదని, ఆయన ఆలోచనలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య రంగంలో ఆయనకు ఉన్న ప్రత్యేక స్థానం ఎప్పటికీ చెరగదని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కూడా పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్థిక రంగ భవిష్యత్తుకు దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

గ్లోబల్ సిస్టమ్స్ ఫర్ ఇంక్లూజివ్ ఫైనాన్స్ అనే అంశాన్ని నిర్ణయించారు. ఆర్థిక రంగ భవిష్యత్తును నిర్దేశించే టెక్నాలజీలపై ఈ ఫెస్ట్ లో ప్రత్యేకంగా చర్చ జరగనుంది. ఏజెంటిక్ ఏఐ ద్వారా ఆటోమేషన్, టోకనైజేషన్ ద్వారా ఆస్తుల డిజిటలైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ ద్వారా సెక్యూరిటీ అంశాలపై గ్లోబల్ పర్స్పెక్టివ్ తో చర్చలు జరుగుతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఫిన్ టెక్ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తేవడంలో డిజిటల్ ఫైనాన్స్ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఇన్నోవేషన్ తో పాటు ఇంక్లూజన్ ను కూడా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. భారత ఫిన్ టెక్ స్టార్టప్ లు గ్లోబల్ స్థాయిలో పోటీపడుతున్నాయని తెలిపారు. జీఎఫ్ఎఫ్ 2026 వేదికగా ప్రపంచ దేశాలకు చెందిన ఫిన్ టెక్ నిపుణులు, ఇన్వెస్టర్లు, పాలసీ మేకర్స్ ఒకే చోటకు చేరారు.

## దళితులకు న్యాయం జరగాలి

(మొదటి పేజీ తరువాయి)

న్యాయం కోరుతున్నట్లు మాట్లాడటం విరుద్ధంగా ఉందని విమర్శించారు. శాసనసభలో మాట్లాడిన భట్టి విక్రమార్క, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనలను ప్రస్తావించారు. అలాంటి వ్యాఖ్యలను నిరసిస్తూ దళితులు స్పందించిన సందర్భంలో వారి పట్ల అవమానకరంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ ఘటనలు సమాజంలో ఆందోళన కలిగించాయని పేర్కొన్నారు. దళితులు రోడ్డుపై నడిచారని ఆ ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేసినట్లు వచ్చిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యలు సామాజిక సమానత్వానికి విరుద్ధమని అన్నా రు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, గౌరవాన్ని ప్రతి ఒక్కరికీ సమానంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలపై వివక్షకు తావులేకుండా సమాజం ముందుకు సాగాలని భట్టి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికి గౌరవం, సమాన హక్కులు ఉండాలని అన్నారు.



## స్పీకర్‌ను అవమానించడం గర్హనీయం

**అసెంబ్లీలో వీధి రౌడీల తరహా ప్రవర్తన సరికాదు**

**బీఆర్ఎస్ వైఖరిపై కాంగ్రెస్, బహుజన నేతల ధ్వజం**

**ఎమ్మెల్సీ తాతా మధుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**

**జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాంపాటి శ్రీను డిమాండ్**

**కోదాడ, సెప్టెంబర్ 9 :**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అవమానించేలా వ్యవహరించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కాంగ్రెస్, బహుజన నాయకులు డిమాండ్ చేశారు. ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు పదేళ్లపాటు ఎలాంటి పదవి చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి పిడతల శ్రీను ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాసనసభలో బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలిపై తీవ్రంగా మండిపడ్డారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాంపాటి శ్రీను మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసనసభలో బీఆర్ఎస్ నాయకులు వీధి రౌడీల తరహాలో ప్రవర్తించడం దురదృష్టకరమని విమర్శించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ, ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు, శాసనసభ గౌరవానికి భంగం కలిగిస్తాయని అన్నారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని పేర్కొన్నారు. స్పీకర్‌ను అవమానించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బహుజన నాయకులు బాజాన్, గుండెపంగు రమేష్, గంధం గిరి, రాజు నాయక్, లిక్కి మోహన్‌రావు, సంజీవ్, శోభన్, జానీ, యేసయ్య, రఫీ, ఖాసీం భాయ్, ఖలీల్, షఫీ, అహ్మద్, వీరబాబు, ప్రవీణ్, రాంబాబు, పిడమర్తి బాబురావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్వేత
సంపాదకీయం
గురువారం 10-9-2026

# యుద్ధ విరమణ దిశగా సాగని చర్చలు!!

రష్యా- ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగిన ఎ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా-రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ సందర్భంగా, పుతిన్ యూరోప్ పట్ల రష్యాకు దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషాకోవ్, పుతిన్ మరియు ట్రంప్ మధ్య జరిగిన ఈ గంటల సంభాషణ 'సంఘటితమైన మరియు చాలా స్పష్టమైనది' అని పేర్కొన్నారు. విట్కాఫ్ మరియు కుష్నర్ చేసిన సందర్శన ఫలితాలను మాస్కో సానుకూలంగా చూస్తుందని ఆయన చెప్పారు.

'డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం చేశాడు, ఇది అమెరికా మరియు రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ చెప్పారు. 'ఈ దృష్టిలో, ఇది వాణిజ్య మరియు ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభావం చూపుతుంది, రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్షతలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నాడు. ఈ దృష్టిని పుతిన్ మద్దతు ఇచ్చారు'. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేందుకు ట్రంప్ మరియు పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో యూరోపియన్ దేశాల పట్ల రష్యా యొక్క దురాశల గురించి చర్చ జరిగింది. 'యూరోప్ పట్ల మాకు ఏ దురాశలు లేవు' అని ఉషాకోవ్ చెప్పారు. ఈ కాల్‌పై వైట్ హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుండి వెంటనే స్పందన లేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్ మరియు స్టీవ్ విట్కాఫ్ మాస్కో మరియు కీవ్‌లో పుతిన్ మరియు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరు చర్చలకు వెళ్లారు. ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ప్రధానమైన ప్రగతి సాధించలేకపోయాయి, మరియు రెండు దేశాలు శుక్రవారం జరిగిన శాంతి విరమణ తర్వాత తమ వాయు యుద్ధాన్ని కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన ప్రకారం, రష్యా కీవ్ నగరాన్ని డ్రోన్లు మరియు మిస్సైల్‌లతో బాంబు విసిరినప్పుడు రెండు వ్యక్తులు మరణించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో రెండు వ్యక్తులు మరణించారు. ఇటీవల నెలలుగా, రష్యా మరియు ఉక్రెయిన్ ఒకదానికొకటి నష్టపరిహారం చెల్లించేందుకు తమ వాయు యుద్ధాన్ని పెంచాయి. ఈ రోజు ముందుగా, రష్యా అధ్యక్షుడి ప్రాతినిధి దిమిత్రి పెస్కోవ్, 'రష్యాకు విజయానికి దగ్గరగా ఉన్నామని' చెప్పారు, 'విజయం చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ , దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. 11న దిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే.

ఆ సమావేశానికి ముందే మోదీ - పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలో నైనా రష్యా యుద్ధం ముగింపుకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





# ప్రజల సేవకులమని మర్చిపోవద్దు

## ఈటల రాజేందర్

మల్కాజ్ గిరి, సెప్టెంబర్ 9: కంటోన్మెంట్ నిధులతో ఎస్బిఐ కాలనీ, చందులాల్ బౌలి, జయ నగర్ కాలనీలలో జజ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్--సికింద్రాబాద్ నగరంలోనే అత్యంత సుందరమైన, హైజీనిక్ ప్రాంతాల్లో కంటోన్మెంట్ ఒకటనీ అన్నారు. మంచి ఉద్యానవనాలు, పరిమిత ఎత్తులో భవనాలు, అన్ని రకాల మౌలిక సదుపాయాలతో హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న కంటోన్మెంట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందనీ పేర్కొన్నారు. అయితే, ఇటీవల వచ్చిన కొత్త జజూ వైఖరి, పనితీరుతో కంటోన్మెంట్ పరిస్థితులు అర్థం కాకుండా మారిపోయాయి. ఆయన వైఖరి కారణంగా కాంట్రాక్టర్లు కూడా పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని నిరసించారు. తీసుకొచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందని, కంటోన్మెంట్ నిష్క్రియాపరత్వంలోకి వెళ్లిపోయిందని దుయ్యబట్టారు. ఇలాంటి పరిస్థితులు చూస్తుంటే, "అసలు మనం కంటోన్మెంట్‌లో ఎందుకు ఉన్నాం? జిహెచ్ఎంసిలో విలీనం అయితేనే మంచిదేమో" అనే స్థాయికి ప్రజలు ఆలోచించే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, నామినేటెడ్ బోర్డు మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారని కితాబు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి సుమారు 18 కోట్ల నిధులు తీసుకురావడానికి కృషి చేశానని, పెండింగ్‌లో ఉన్న కొన్ని పన్నులు, స్టాంప్ డ్యూటీ ద్వారా వచ్చిన నిధులను కూడా ప్రజా అవసరాల కోసం వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. అందులో భాగంగా 59 లక్షలతో ఈ రోడ్డు పనులను ప్రజల సమక్షంలో ప్రారంభించామని గుర్తు చేశారు. కంటోన్మెంట్ అభివృద్ధి చెందాలి... ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందాలి... నిధులు సద్వినియోగం కావాలి, ఇదే మా లక్ష్యమని స్పష్టం చేశారు. బ్రతుకే చాలా భారంగా మారిపోయిన ఈ రోజుల్లో చదువుకున్న వాళ్లు కూడా అరటిపళ్ళ బండి పెట్టుకుని, చిన్న హోటల్ పెట్టుకుని, డబ్బా కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అలాంటి పేద, మధ్యతరగతి ప్రజలను ప్రభుత్వం ఫెసిలిటేట్ చేయాలి. వారికి జీవనోపాధి కల్పించాలి. కానీ అందుకు విరుద్ధంగా, "వీళ్లు మాకు ఎదురు చెప్తారా?" అనే ధోరణితో దరిద్రపు నిబంధనలు పెట్టి వారి ఉపాధిని దెబ్బతీయడం సరైన విధానం కాదు. ఇలాంటి పిచ్చి పనులు చేయకండి. పేద ప్రజల ఉపాధిని దెబ్బతీయకండి. చిరు వ్యాపారం చేసుకునేవాడు కావచ్చు, చిన్న దుకాణం పెట్టుకుని బతికేవాడు కావచ్చు, నీళ్ల ప్యాకెట్లు అమ్ముకునేవాడు కావచ్చు. ఇలాంటి చిన్న వ్యాపారులందరినీ ఇబ్బంది పెట్టొద్దని దాదాపు సంవత్సరం నుంచి చెబుతున్నాను. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. పేద ప్రజల జీవితాలతో ఆడుకునే ప్రయత్నం అధికారి చేసినా, ప్రజాప్రతినిధి చేసినా అది వాంఛనీయం కాదనీ, సహించరానిదనీ హెచ్చరించారు. నిన్న, మొన్న కూడా ఈ విషయాన్ని మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లాను. కంటోన్మెంట్‌లో పరిస్థితి బాగోలేదని జాయింట్ సెక్రటరీ రాకేష్ మిట్టల్ గారికి కూడా తెలియజేశాను.

ఇక మరో నాలుగైదు రోజులు పరిస్థితిని చూస్తాం. అప్పటికీ ఇదే విధంగా కొనసాగితే, నేనే స్వయంగా ఉత్తరం రాసి, ఆ పేద ప్రజలకు మళ్లీ ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తానని స్పష్టంగా చెబుతున్నాను. ఇంత దరిద్రమైన వ్యవస్థ మంచిది కాదు. పాలకులు, ప్రభుత్వాలు చేయాల్సింది ఒక్కటే---ఎవరు ఎలాంటి జీవనోపాధితో బతుకుతున్నారో, వారికి ఆ జీవనోపాధిని కొనసాగించేందుకు సహకరించాలి. ప్రజలకు నిజంగా ఇబ్బంది ఉంటే, ఆ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలి. కానీ అధికారం ఉందనే అహంకారంతో పేదవాళ్ల జీవితాలతో చెలగాటం ఆడటం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదు. అది ప్రజాప్రతినిధి చేసినా సహించరాదు. అధికారి చేసినా సహించరాదు. అధికారులు ఒక విషయం గుర్తుంచుకోవాలి, వాళ్లకు జీతాలు చెల్లించేది ప్రజలు కట్టే పన్నుల డబ్బు. ప్రజలకు తాము సేవకులమనే విషయాన్ని అధికారులు మర్చిపోకూడదు.

కానీ కొంతమంది అధికారులు బాసులుగా వ్యవహరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అయినా, కేంద్ర ప్రభుత్వ అధికారులు అయినా---ప్రజావ్యతిరేక ధోరణి, నిర్లక్ష్యం చివరకు ప్రజా కంటకంగా మారే ప్రమాదం ఉంది.

ఈ ప్రజావ్యతిరేక ధోరణికి అడ్డుకట్ట వేయాలి. దీనికి సరైన మార్గాన్ని అన్వేషించాలి. ఈ విషయంపై నర్మద గారికి ఇప్పుడే చెప్పాను. ఈ వారం రోజుల్లో మీరు చర్యలు తీసుకోండి అమ్మా. లేదంటే నేనే స్వయంగా వచ్చి వారికి ఉపాధి కల్పిస్తానని స్పష్టంగా చెప్తున్నాను. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసన సభ్యులు ఎన్. శ్రీ గణేష్, కంటోన్మెంట్ బోర్డు మెంబెర్ నర్మధ మల్లికార్జున్, సీనియర్ నాయకులు బిన్ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాణిక్ రెడ్డి, కంటోన్మెంట్ కన్వీనర్ విజయానంద్, వార్డ్ 6 ప్రెసిడెంట్ ప్రతిక్, సీనియర్ నాయకులు పిట్ల నగేష్, విజయ్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## గణేష్ నవరాత్రుల సన్నాహక సమావేశం

కాప్రా, సెప్టెంబర్ 9 : కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో బుధవారం భవాని నగర్ కమ్యూనిటీ హాల్లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికార సిబ్బందితోపాటు ఎలక్ట్రికల్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, జలమండలి, హైడ్రా పోలీసు, ట్రాఫిక్ తదితర విభాగాల అధికార సిబ్బంది హాజరయ్యారు.

# చర్లపల్లి జిల్లా పరిషత్ విద్యార్థులకు లయన్స్ చేయూత

చర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ రోజు లయన్స్ క్లబ్ ఆఫ్ కమలానగర్ స్ఫూర్తి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వనం విజయ్ కుమార్ అల్లుడు కీర్తిశేషులు శ్రీ సిరిపురం హరిప్రసాద్ గారి జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ మెటీరియల్‌ను అందజేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. కృష్ణా రెడ్డి, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ ఎం. సురేష్, శేఖర్ రెడ్డిలు 80 మంది 10వ తరగతి విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీ కె. కృష్ణా రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఈ స్పోకెన్ ఇంగ్లీష్ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని ఇంగ్లీష్‌ను ధారాళంగా



మాట్లాడే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. విశ్రాంత అకౌంట్స్ అధికారి శ్రీ సిరిపురం రంగయ్య గారు, తన కుమారుడు కీర్తిశేషులు శ్రీ హరిప్రసాద్ గారి జ్ఞాపకార్థం, గతంలో మాదిరిగానే 10వ తరగతి విద్యార్థుల గాూజ పరీక్ష ఫీజును చెల్లిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, కన్నన్, పి.ఆర్.పి.రాజు, రూపా రెడ్డి, ఎస్.రంగయ్య, భాస్కర్ రెడ్డి, కె. రేణుక, రమాదేవి, నరేష్, దేవేందర్ రెడ్డి, ప్రవీణ్ , రాజశేఖర్, రాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

**నీటి సంరక్షణ, స్వచ్ఛత, హరిత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టండి**

**రైతులకు ఎరువుల కొరత లేకుండా పటిష్ట పర్యవేక్షణ**

**ప్రజా భద్రతపై రాజీ లేదు.. విస్తృతంగా భద్రతా తనిఖీలు నిర్వహించాలి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టమైన ఆదేశాలు**

ముఖ్యమంత్రి కార్యాలయం, పీజీఆర్ఎస్.. ఇలా వివిధ మార్గాల ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన విచారణ చేపట్టి తప్పనిసరిగా నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరం నుంచి కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ.. జిల్లా స్థాయి అధికారులతో నేరుగా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వర్చువల్ గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలధార--జలహారతి 2.0 కింద పనులకు అవసరమైన అనుమతులను వేగంగా పొందడంతో పాటు పనులను పటిష్టంగా పర్యవేక్షించాలని సూచించారు. నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాల పరిస్థితిని పర్యవేక్షించాలని, వాన నీటి సంరక్షణ, రీఛార్జ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది స్వయంగా పాల్గొని పరిశుభ్రత, ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నెట్ జీరోలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో సోలార్ ప్యానెళ్లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ప్లాంటేషన్ పనులను వేగవంతం చేసి, వేప, టేకు వంటి నాణ్యమైన మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో సెకండ్ డోస్ ప్రారంభమైనందున ఆర్డీవోలు, సంబంధిత అధికారులు ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల్లోని స్టాక్‌ను ప్రతి వారం తనిఖీ చేయాలని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని ఆదేశించారు. ఎరువుల దుకాణాల వద్ద ధరలు, ఫిర్యాదుల కోసం కలెక్టర్ కార్యాలయ కాల్ సెంటర్ వివరాలతో ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ పెట్రోల్ బంకులు, బహుళ అంతస్తుల భవనాలు, థియేటర్లు, కెమికల్ పరిశ్రమలు, షాపింగ్ ఏరియాలు తదితరాల్లో భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. 'వన్ ఫ్యామిలీ--వన్ ఆంత్రప్రెన్యూర్' సర్వే డేటాను మండలాలు, పట్టణ ప్రాంతాల్లో వేగంగా అప్‌డేట్ చేయాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.సమావేశం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. కాలుష్య నియంత్రణ మండలి, ఇతర సమన్వయ శాఖల అధికారులతో కలిసి మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం పోస్టర్లను ఆవిష్కరించారు..

సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.



## నారాయణపేట జిల్లా సబ్-రిజిస్ట్రార్ (గ్రేడ్-2) మరియు ఒక ప్రైవేట్ వ్యక్తి ఏసీబీవలలో

**జ్యోతి శ్వేత, అమీర్ హుస్సేన్ (క్రైమ్ బ్యూరో చీఫ్):**

నారాయణపేట జిల్లా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన సబ్-రిజిస్ట్రార్ (గ్రేడ్-2) శ్రీ లాగిశెట్టి వెంకట్ స్వామి (ఆా-1) మరియు ప్రైవేట్ వ్యక్తి ('ఇంటి భోజనం మెస్' యజమాని) శ్రీ కమ్మరి నాగేశ్ (ఆా-2) లపై నేరపూరిత దుష్ప్రవర్తనకు సంబంధించి కేసు నమోదు చేయబడింది. ఫిర్యాదుదారునికి చెందిన ఇంటి రిజిస్ట్రేషన్ (డాక్యుమెంట్ నం. 4723/2026) ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారికంగా అనుకూలంగా వ్యవహరించే నిమిత్తం,ఆా-1 రూ. 90,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా 21.07.2026న ఆా-2 ద్వారా రూ. 50,000 స్వీకరించారు, ఆ తర్వాత మిగిలిన రూ. 40,000 కోసం డిమాండ్ చేశారు. తద్వారా,ఆా-1 తన అధికారిక విధులను నిర్వహించడంలో అక్రమంగా మరియు నిజాయితీ లేకుండా వ్యవహరించి, తనకు తాను అక్రమ లబ్ధిని పొందడానికి ప్రయత్నించారు. కావున, AO-1 మరియు A-2 లను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లి లోని SPE & ACB కేసుల గౌరవనీయులైన మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి (I Addl. Special Judge) ముందు హాజరు పరుస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి. సెల్ ఫోన్ నంబర్ - 1064 (టోల్-ఫ్రీ నంబర్); ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, చట్టపరమైన చర్యల కోసం ప్రజలు ఏసీబీ (ACB) టోల్-ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని కోరడమైనది.



## పురోగతిపై చక్కని ప్రజెంటేషన్

**వివిధ శాఖలు అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశం**

ఏలూరు, సెప్టెంబరు 09: జిల్లా కలెక్టరేటు గౌతమీసమావేశం మందిరంలో బుధవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు ఈ నెల ( రేపటి నుండి) 10,11 తేదీలు జరిగే సమావేశానికి శాఖలు వారీగా పూర్తిస్థాయి నివేదికలు సాయంత్రానికి అందించాలని సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ పాల్గొన్నారు. వివిధ శాఖలు పరిధిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలు, పురోగతిలో ఉన్న పనులు తదితర అంశాలుపై శాఖల వారీగా జిల్లా కలెక్టరు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు ఈ నెల ( రేపటి నుండి) 10,11 తేదీల్లో అమరావతి వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరగనున్నదని అన్నారు. ఇప్పటివరకు సాధించిన ప్రగతి, రానున్న రోజుల్లో చేపట్టబోయే లక్ష్యాలు, మనకు కావసిన నిధులు శాఖలు వారీగా చక్కని ప్రజెంటేషన్, ఈ రోజు సాయంత్రానికి అందించాలని ఆదేశించా మని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు రోజులు సమావేశానికి ఏలూరు జిల్లా తరపున చక్కని ప్రజెంటేషన్ ఇవ్వడానికి దోహదపడుతుందని అన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన తాజా వివరాలు, పురోగతి నివేదికలు, సాధించిన లక్ష్యాలు, పెండింగు అంశాలు తదితర సమాచారాన్ని ఒకటికి రెండు సార్లు వెరిఫై చేసుకుని అందించాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు అమలులో ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే వాటిని గుర్తించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన అంశాలుపై పూర్తి అవగాహనతో, వాస్తవ గణాంకాలతో నివేదికలు సిద్ధం చెయ్యాలి అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాకు సంబంధించిన అంశాలను సమర్థ వంతంగా వివరించేలా అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసి, మంచి ప్రజెం టేషన్ అందించాలని అన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు తీరు పై ఖచ్చితమైన గణాంకాలతో కూడిన నివేదికలను పవర్ పాయింటు ప్రజెంటేషన్ (ప్రాు) రూపంలో సిద్ధం చెయ్యాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలు పేదలు సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం, మౌళిక వసతులు కల్పన వంటి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు క్షేత్రస్థాయి పురోగతిని విజయగాథగా పొందుపరచాలని అన్నారు.



## పెంచిన ధరలను తగ్గించాలి

**నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై అందించాలి.**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా.ప్రభాకర్**

**సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వర రావు.**

భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ఏలూరు అర్బన్ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించి తహసిల్దార్ కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల తహసిల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి వినతి పత్రాలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నరేంద్ర మోడీ ఎన్నికల సమయంలో ఆకాశంలో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను నేలకు దించి సామాన్యునికి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చి 12 ఏళ్లు గడిచినప్పటికీ ధరలను తగ్గించకపోగా రకరకాల కారణాలతో విపరీతంగా పెంచుతున్నారని ఆరోపించారు. నిత్యావసరాలతో పాటు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు సైతం విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై ఆర్థికంగా భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీ చాలని వేతనాలతో అస్తవ్యస్త ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రజలకు నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదల మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు మరింత ఇబ్బందులను కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, 16 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ డిపోల ద్వారా ప్రజలకు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో అధిక ధరలకు వ్యతిరేకంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 12 ఏళ్లుగా కేంద్రంలో నరేంద్ర మోడీ దేశ ప్రజలపై అధిక ధరల భారాన్ని వేస్తూ ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధిక ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ధరలను తగ్గించకపోగా రకరకాల కారణాలతో మరింతగా పెంచుతున్నారని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న అధిక ధరల బారాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.అధిక ధరలు వలన ప్రజలు ఆర్థికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యవర్గ సభ్యులు మావూరి విజయ,జి.స్వాతి, బళ్ల కనకదుర్గారావు, ఉప్పులూరి లక్ష్మి, భవాని, రేఖ, ఎం.సత్యవతి, బాలిన ప్రసాద్,జిజ్జి వరపు సురేంద్ర, అమర్, కె.సురేష్, ఎస్.సోమేశ్వరరావు, వై.శ్రీనివాసు, ఎం.మహేష్, అప్పారావు,తదితరులు పాల్గొన్నారు.



## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**తడికలపూడి ఎస్సై వల్లి పద్మ**

కామవరపుకోట, సెప్టెంబర్ 9, చట్టాలపై విద్యార్థినీ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తడికలపూడి ఎస్సై వల్లి పద్మ సూచించారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థిని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై ఇంటి పరిసరాలలోని పెద్దలకు అవగాహన కలగజేసే బాధ్యత విద్యార్థిని, విద్యార్థులు తీసుకోవాలన్నారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే మాయాజాలానికి యువత ఆకర్షితులై బంగారు భవిష్యత్తులను పాడు చేసుకోవద్దన్నారు. అలాగే చెడు అలవాట్లకు, మద్యం, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనాల ప్రయాణ సమయాల్లో కుటుంబ సభ్యులతో పాటు ఇరుగుపొరుగు వారు కూడా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. చదువు ద్వారా మంచి భవిష్యత్తును పొందవచ్చని, విద్యార్థి దశలోనే తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని సబ్జెక్టులు వారిగా తర్ఫీదు పొందినట్లయితే గమ్యాన్ని చేరుకోవటం సులభతరం అవుతుందన్నారు.

# రిలయన్స్ కోసం రైతుల జీవితాలను బొగ్గు పాలు చేస్తారా?

**యూసీజీ బొగ్గు వెలికితీతపై వాస్తవాలు ప్రజలకు చెప్పండి..**

**బొగ్గు గని కోసం మా భూములు ఇవ్వం..**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన రైతుల సమావేశం తీర్మానం**

చింతలపూడి (అంకులయ్య కొత్తగూడెం) సెప్టెంబర్ 9: రిలయన్స్ లాభాల కోసం రైతులు, ప్రజల జీవితాలను బొగ్గు పాలు చేస్తారా అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ ప్రశ్నించారు. రాఘవాపురం శివారు అంకులయ్య కొత్తగూడెంలో బొగ్గు గని ప్రాంత రైతుల సమావేశం నిర్వహించారు. రిలయన్స్ కు మా భూములు ఇవ్వం అంటూ రైతులు ఆందోళన చేపట్టారు. మా భూమి మా హక్కు అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రిలయన్స్ బొగ్గు ఆధారిత గ్యాస్ ఉత్పత్తికి ఈ ప్రాంతంలో దాదాపు 10 వేల ఎకరాలు భూసేకరణ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని రైతులతో చర్చించకుండా, రైతుల ఆమోదం లేకుండా భూములు బలవంతంగా లాక్కుంటారా అని ప్రశ్నించారు. లక్షల కోట్ల రూపాయలు రిలయన్స్ కంపెనీ పెట్టుబడులు పడుతుందని ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. ప్రతిపాదిత బొగ్గు గ్యాస్ ఉత్పత్తి వలన కేవలం 5 వేల మందికి మాత్రమే ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వమే ప్రకటించిందని చెప్పారు. ఆయిల్ పామ్, కొబ్బరి, కోకో, మొక్కజొన్న, వరి తదితర ఉద్యాన, వ్యాపార,ఆహార పంటల వలన ప్రజలకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని, ఈ అభివృద్ధి,ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు ఆధారిత గ్యాస్ ఉత్పత్తి వలన వచ్చే పర్యావరణ ముప్పు గురించి మాట్లాడకుండా గోప్యంగా ఉంచుతున్నారని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని




కోరారు. ఇప్పటికైనా ప్రతిపాదిత బొగ్గు గని ప్రాజెక్టు సమగ్ర రిపోర్టును ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి. పాండు రంగారావు, సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్.వి.ఎస్.నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సత్యనారాయణ రైతులు చీకటి శ్రీనివాసరావు, శెట్టిపల్లి ప్రసాద్, మామిళ్ళపల్లి అప్పారావు, బాలా నరసింహారావు, చీకటి వెంకట సత్యనారాయణ, చీకటి రజని, మట్టా దమయంతి, మోరంపూడి శ్రీనివాసరావు, చీకటి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫేక్ మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలి



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 : బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా, వివిధ డిజిటల్ వేదికల్లో మార్ఫింగ్ చేసిన తప్పుడు చిత్రాలు, ఏఐ ద్వారా రూపొందించిన ఫేక్ ఇమేజ్‌లు, దుష్ప్రచార కంటెంట్‌ను ప్రచారం చేస్తున్న వారిపై తక్షణమే దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ శాసనసభాపక్షం తరఫున ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ చారి గార్లు తెలంగాణ డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్ IPS గారికి ఫిర్యాదు అందజేశారు. రెండు రోజుల క్రితం తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి, దురుసు ప్రవర్తన ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఉద్దేశపూర్వకంగా ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫేక్ లేదా ఏఐ జనరేటెడ్ చిత్రాలను నిజమైనవిగా చూపిస్తూ ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడమే కాకుండా, ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ శాసనసభాపక్షం పేర్కొంది.

**సైబర్ ఫోరెన్సిక్ దర్యాప్తు చేయాలి**

ఫేక్, మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలు, పోస్టులను సైబర్ క్రైమ్ విభాగం వెంటనే గుర్తించి దర్యాప్తు చేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. ఈ కంటెంట్‌ను రూపొందించిన, అప్‌లోడ్ చేసిన, ప్రచారం చేసిన వ్యక్తులను గుర్తించాలని, సంబంధిత చిత్రాలపై సాంకేతిక ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే సంబంధిత డిజిటల్ ఆధారాలు, సోషల్ మీడియా అకౌంట్ వివరాలు, ఖాతాలు, టైమ్‌స్టాంప్‌లు, మెటాడేటాను భద్రపరచాలని కోరారు. సైబర్ క్రైమ్, పరువునష్టం, తప్పుడు సమాచార ప్రచారం తదితర వర్తించే చట్టాల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

ఫేక్, మార్ఫింగ్ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకుని ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని బీఆర్ఎస్ శాసనసభాపక్షం పేర్కొంది.రాజకీయ భేదాలు ఉన్నాయనే కారణంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులపై కల్పిత డిజిటల్ కంటెంట్‌ను తయారు చేసి ప్రచారం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది.

అసెంబ్లీ ఘటనపైనా చర్యలు తీసుకోవాలి

అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో పోలీసుల వైఖరిపై కూడా సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం కోరింది. సంబంధిత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేసింది.

మొత్తం వ్యవహారంపై నిష్పక్షపాతంగా, అత్యవసరంగా దర్యాప్తు నిర్వహించి, ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను రూపొందించి ప్రచారం చేసిన వారితో పాటు అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డీజీపీని కోరారు.

# బేబీ పాండ్‌లో గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

మల్కాజిగిరి, సెప్టెంబర్ 9: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కాప్రా చెరువులో ఏర్పాటు చేస్తున్న బేబీ పాండ్ వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను ఎంఎంసీ కమిషనర్, ఉప్పల్ జోనల్ కమిషనర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ తనిఖీలో పౌరసరఫరాలు, టౌన్ ప్లానింగ్, యూబీడీ, రామ్‌కీ, ఈపీటీఆర్ఐ ప్రతినిధులు పాల్గొని చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిని వివరించారు. గణేశ్ నిమజ్జన సమయంలో సహజ జలవనరులపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా కాప్రా చెరువు వద్ద ప్రత్యేకంగా బేబీ పాండ్‌ను సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పరిమాణంలోని గణేశ్ విగ్రహాలను ఈ పాండ్‌లో నిమజ్జనం చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. దీనివల్ల ప్రధాన చెరువులో ఏర్పడే రద్దీ తగ్గడమే కాకుండా, నీటి కాలుష్యాన్ని కూడా నియంత్రించవచ్చని అధికారులు భావిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన నిమజ్జన వేదిక కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పాండ్ పరిసరాల్లో డీసిల్టింగ్ పనులు, పారిశుధ్య చర్యలు, తాజా నీటి నింపుదల వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు.



# హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

కాప్రా, సెప్టెంబర్: కుషాయిగూడ ప్రకాండలో విశ్వ హిందూ పరిషత్ స్థాపన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అణుశక్తి జిల్లా సంయోజక్ శ్రీమతి పూజ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ మాతృశక్తి సంయోజక్ పద్మశ్రీ, తెలంగాణ విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ సునీత రాంమోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికల రక్షణ, మత మార్పిడుల నివారణకు అవగాహన కల్పించడంతో పాటు, పిల్లలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో ధార్మిక, సాంస్కృతిక విలువలను పెంపొందించేలా మార్గదర్శనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కుషాయిగూడ ప్రకాండ బాల సంస్కార కేంద్ర ప్రముఖ్ జ్యోతి, మణి తదితరులతో పాటు పలువురు హిందూ బంధువులు పాల్గొన్నారు.




# విజయవంతంగా నిజం గెలిచింది కార్యక్రమం

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి పిలుపుతో నియోజకవర్గ వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు

విజయనగరం, సెప్టెంబర్ 9, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు మేరకు నిజం గెలిచింది కార్యక్రమం విజయవంతం చేశారు. నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని చీకటి దినోత్సవం గా ప్రకటిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వైసీపీ ఆధ్వర్యంలో జగన్ రెడ్డి నాయకత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారిని అక్రమంగా అరెస్టు చేసి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సెప్టెంబర్ 9వ తేదీని చీకటి దినంగా భావిస్తూ బుధవారం సాయంత్రం గజపతినగరం నియోజకవర్గ




కేంద్రంతో పాటు, గంట్యాడ, దత్తిరాజేరు, జామి, బొండపల్లి మండలాల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పీవీ గోపాలరాజు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ విభాగాల డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు, వివిధ విభాగాల డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పోషణ్ మహ్ -2026 గోడప్రతులను ఆవిష్కరించిన కె.వెట్రిసెల్వి

ఏలూరు, సెప్టెంబరు 09: జిల్లా కలెక్టరేటు గౌతమీసమావేశ మందిరంలో బుధవారం జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ మహ్ -2026 గోడప్రతులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషక ఆహారంపై అవగాహన పెంపొందించడమే పోషణ్ మహ్-2026 ప్రధాన లక్ష్యమని అన్నారు. సమతుల్య ఆహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, తల్లిపాలు, చిన్నారులు ఆరోగ్యసంరక్షణ వంటి అంశాలుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పోషకాహార కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన వైద్య, పోషక సహాయం అందించాలని అన్నారు. ప్రతి కుటుంబం పోషకాహారం, ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోషణ్ మహ్-2026 సందర్భంగా జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చెయ్యాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, ఇంచార్జి డిఆర్వో, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఐసిడిఎస్ పిడి పి.శారద, జిల్లా గృహనిర్మాణ శాఖ పిడి.జి.సత్యనారాయణ, నగర పాలక సంస్థ కమీషనరు ఏ.భాను ప్రతాప్, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జి.వి.కె.మల్లిఖార్జునరావు, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, డిఆర్డిఏ పిడి టి.వి.విజయలక్ష్మి, నోడల్ అధికారి ఇ.తులసి, సిడిపివో ఏ.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు ఆత్మీయ సత్కారం

చింతలపూడి, సెప్టెంబర్ 9: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సేవలు అందించే ఫ్రంట్ లైన్ వారియర్స్ ను ప్రతి ఒక్కరు కూడా గుర్తించి సత్కరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ పేర్కొన్నారు. చింతలపూడి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి చీదరాల దుర్గా పార్వతి మధుబాబు ఆధ్వర్యంలో ఫ్రంట్ లైన్ వారియర్స్ కు ప్రత్యేక సత్కార కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి మండలం, పట్టణ పరిధిలోని యూపీహెచ్సీ, పీహెచ్సీలలో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న సుమారు 150 మంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా గుర్తిస్తూ వారికి నూతన వస్త్రాలను శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ చేతుల మీదుగా బహుకరించారు.



గౌరవ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి చీదరాల దుర్గా పార్వతి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ముందుండి సేవలందిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల సేవలను ఈ సందర్భంగా శాసనసభ్యులు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల జనసేన పార్టీ అధ్యక్షులు చీదరాల మధుబాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాటి అప్పారావు, పట్టణ బీజేపీ పార్టీ అధ్యక్షులు శ్రీమతి కొత్తపల్లి విజయ కుమారి , ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి రామకృష్ణ, లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ గుత్తా సత్యసాయి వరప్రసాద్ (పెదబాబు) , కూటమి నాయకులు, కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యంలో విమర్శలు ఉండాలి అవమానాలు కాదు: దామోదర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :**

శాసనసభలో ఇటీవల చోటుచేసుకున్న ఘటన తనను తీవ్రంగా బాధించిందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు స్థానం ఉన్నప్పటికీ వ్యక్తిగత అవమానాలకు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. రాజకీయ కక్షతో తల్లిని దూషించడం అత్యంత బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. రాజకీయ భేదాలు ఉన్నా వ్యక్తిగత దూషణలు, అసభ్యకర వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు. మన మాటల్లో సంస్కారం, మన ప్రవర్తనలో గౌరవం ఉండాలని మంత్రి సూచించారు. గౌరవ స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించడం సరికాదని, సభా సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ కోపాన్ని రాజ్యాంగ వ్యవస్థలపై ప్రదర్శించడం బాధాకరమని దామోదర్ రాజనర్సింహ వ్యాఖ్యానించారు. గౌరవప్రదమైన స్పీకర్ కుర్చీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు తమ ప్రవర్తన ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత ఉందని మంత్రి అన్నారు. రాజకీయ విభేదాలు ఎంత ఉన్నా రాజ్యాంగబద్ధ సంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని తెలిపారు. సభా గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు, చర్యలను సమాజం సమర్థించదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ పరస్పర గౌరవంతో రాజకీయాలు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఓటర్ల జాబితాపై కలెక్టర్ సమీక్ష

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 9 :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు, వార్డు అధికారులతో జరిగిన ఈ సమావేశంలో క్షేత్రస్థాయి సర్వే పనులను సమీక్షించారు. సర్వే నిర్వహణ తీరు, ఓటర్ల వివరాల ధృవీకరణ, నో-మ్యాపింగ్ అంశాలపై కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం కోసం అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పని చేయాలని సూచించారు. డేటాలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదు, సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని, అభ్యంతరాలు, క్లెయిమ్‌లను నిబంధనల ప్రకారం పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని అన్నారు. బూత్ లెవల్ అధికారులు, వార్డు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ సవరణ కార్యక్రమాన్ని సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో జగదీశ్వర్ రావు, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ రాజు, తహసీల్దార్లు శ్రీనివాస్, వేణు, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ ఇస్తారి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.



# విద్యాబోధనకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9 :**



టేకులపల్లి మండలంలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాబోధన, విద్యార్థుల హాజరు, తరగతి గదులు, ప్రయోగశాలలు, భోజనశాల, పరిశుభ్రత, యూనిఫాంల పంపిణీ, వెల్నెస్ సెంటర్ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. 8, 9 10వ తరగతులను పరిశీలించిన కలెక్టర్ కొన్ని తరగతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంపై ఆరా తీశారు. గ్రామసభ, విద్యార్థి పార్లమెంట్, స్కాలర్‌షిప్ బ్యాంకు ఖాతాల ప్రారంభం వంటి కార్యక్రమాల కారణంగా విద్యార్థులు తరగతులకు దూరంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. అలాగే లైబ్రరీ పీరియడ్ సమయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి సమయాన్ని పూర్తిగా విద్యాబోధనకే కేటాయించాలని స్పష్టం చేశారు. ఇతర కార్యక్రమాలను తరగతుల అనంతరం లేదా శనివారాల్లో నిర్వహించాలని ఆదేశించారు. విద్యా క్యాలెండర్ ప్రకారం ప్రతి పీరియడ్ సక్రమంగా నిర్వహించి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. భౌతిక శాస్త్ర ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులు స్వయంగా ప్రయోగాల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా బోధించడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆసక్తి పెంపొందించాలని సూచించారు. కొత్తగా చేరిన అర్హులైన విద్యార్థులకు యూనిఫాంలను వెంటనే అందించాలని ఆదేశించారు. భోజనశాల, వంటగది, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని కలెక్టర్ సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని, ప్రధాన వంట మనిషి సెలవులో ఉన్నందున ప్రత్యామ్నాయ వంట మనిషిని వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టోర్‌లోని కూరగాయలు, రిఫ్రిజిరేటర్‌లోని పాలు, పెరుగు నాణ్యతను పరిశీలించి ఫుడ్ సేఫ్టీ అధికారులతో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వెల్నెస్ సెంటర్‌లో మందులు, రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాబోధన, హాజరు, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను ప్రాధాన్యతగా పూర్తి చేయాలి

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 9 :**





నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 70 గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. భూ సర్వే పనులను ప్రాధాన్యతగా తీసుకొని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే విధానంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, అటవీ భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సర్వే నంబర్ కు సంబంధించి సరిహద్దులు, విస్తీర్ణం, హద్దు రాళ్లను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి ధృవీకరించాలని తెలిపారు. రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే ప్రక్రియ మొత్తం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం జరగాల ని తెలిపారు. సాంకేతిక పరికరాలను వినియోగించి అత్యంత కచ్చితత్వంతో కొలతలు చేపట్టా లని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలని అధికా రులకు దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ చెన్నారం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కలెక్టర్ పరిశీలించారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థుల హాజరు పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, మండల స్థాయి అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# స్టేడియంలో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు

**గద్వాల, సెప్టెంబర్ 9 :**



ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలను కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం గద్వాలలోని ఇండోర్ మైదానాన్ని సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. స్టేడియం పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుబాటులో ఉన్న సౌకర్యాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బ్యాడ్మింటన్ కోర్టు, జిమ్, మార్షల్ ఆర్ట్స్ విభా గాలను పరిశీలించారు. క్రీడాకారులు ప్రాక్టీస్ చేసే ప్రాంతా ల్లో ఉన్న వసతులను పరిశీలించి మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. స్టేడి యం ప్రహరీ గోడలపై క్రీడలకు సంబంధించిన పెయిం టింగ్స్ తో పాటు ప్రముఖ క్రీడాకారుల చిత్రాలు, వారి వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. బ్యాడ్మింటన్ కోర్టులో సింథటిక్ మ్యాట్ ఏర్పాటు, లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్టేడియంలో ఉన్న మరుగుదొడ్లను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. క్రీడాకారులకు తాగునీటి వసతి, విశ్రాంతి గదుల వంటి కనీస సౌకర్యాలలో ఎలాంటి లోటు ఉండకూడదని తెలిపారు. స్టేడియంలో ఫ్లడ్ లైట్స్ పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రాత్రి సమయాల్లో కూడా క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేందుకు వీలుగా లైటింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులన్నింటినీ సకాలంలో, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇండోర్ స్టేడియాన్ని జిల్లాలో క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు మెరుగైన వసతులు ఎంతో అవసరమని, దీనివల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులు రాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, స్టేడియం ఇన్చార్జి బషీర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రసాయనాల వాడకం తగ్గించి మట్టి ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

**జనగామ, సెప్టెంబర్ 09 :**



రసాయనాల వాడకాన్ని తగ్గించి మట్టి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. బుధవారం జిల్లాలోని దేవరుప్పుల మండలం కోల్కొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ లో భాగంగా నిర్వహించిన మృత్తికా విశ్లేషణ, అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మట్టి పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అధిక శాతం మంది వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారేనని, అందువల్ల మట్టి ఆరోగ్యం, భూసార పరిరక్షణపై వారికి పూర్తి అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొ న్నారు. అధిక రసాయనాల వినియోగం వల్ల మట్టి క్రమం గా విషతుల్యంగా మారి పంటల నాణ్యత దెబ్బతినడంతో పాటు దిగుబడులు కూడా తగ్గిపో తున్నాయని వివరించా రు. భూసారాన్ని పరిరక్షించ డానికి మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, పరీక్షల ఫలితాల ఆధా రంగానే ఎరువులను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. శాస్త్రవేత్తలు చూపించిన మట్టి నమూనాల సేకరణ విధానాన్ని విద్యార్థులు క్షుణ్ణంగా నేర్చుకోవాలని తెలిపారు. పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు ఆంజనేయులు పర్యవేక్షణలో ప్రభుత్వం అందించిన ప్రత్యేక సాయిల్ హెల్త్ కిట్ల ద్వారా విద్యార్థులు తమ సొంత పొలాల నుంచి తీసుకొచ్చిన మట్టి నమూనాలను స్వయంగా పరీక్షించాలన్నారు. మట్టి పరీక్షల ద్వారా వచ్చే ఫలితాలను అర్థం చేసుకుని రసాయనాల అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలను తమ తల్లిదండ్రులకు వివరించాలని విద్యార్థులకు కలెక్టర్ పిలుపునిచ్చారు. భూసార పరిరక్షణకు అనువైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులను పాటించేలా తల్లిదండ్రులను చైతన్యపరచాలని సూచించారు. విద్యార్థులు రైతు కుటుంబాలకు వారధిగా నిలవాలని అభిప్రాయపడ్డారు. అంతకుముందు ప్రాంతీయ మృత్తికా పరీక్షా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనురాధ, డాక్టర్ వికాస్ విద్యార్థులకు మట్టి నమూనాలు ఎలా సేకరించాలి, ఏ విధంగా పరీక్షించాలి అనే అంశాలను ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. మట్టి నమూనాలు సేకరించే సరైన పద్ధతులు, వాటి ప్రాముఖ్యత, మట్టి పరీక్షల ద్వారా తెలిసే పోషక విలువల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, మండల వ్యవసాయ అధికారి మనోహిత్ విక్రమ్ రావు, వ్యవసాయ విస్తరణాధికారి శ్యామల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయులు, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ-బీఆర్ఎస్ ఒకే సిద్ధాంతం: మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల సిద్ధాంతం ఒకటేనని, రెండు పార్టీలు ఒకే భాష మాట్లాడుతూ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని రాష్ట్ర మంత్రి సీతక్క శాసనసభలో విమర్శించారు. ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశాన్ని బీజేపీ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆమె గుర్తుచేశారు. అదే తరహాలో తెలంగాణలోని ములుగు జిల్లాలో దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆరోపించారు. ఈ ఘటన సమాజాన్ని అవమానించే చర్యగా నిలిచిందని, దళితుల గౌరవాన్ని దెబ్బతీసే ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సమానత్వాన్ని కాపాడాల్సిన రాజకీయ పార్టీలు ఇటువంటి వివక్షపూరిత చర్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని సీతక్క అన్నారు. కుల వివక్షను ప్రోత్సహించే విధంగా వ్యవహరించడం సమాజంలో విభేదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడం కంటే ఘోరమైన చర్య మరొకటి ఉండదని ఆమె వ్యాఖ్యానించారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజాస్వామ్య సమాజం సహించదని సీతక్క స్పష్టం చేశారు. దళితుల పట్ల వివక్షను ప్రదర్శించే ఏ రాజకీయ శక్తినైనా ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారని అన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న మంత్రి, కుల వివక్షకు తావులేని సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.



# ప్రజల సమస్యలను అక్షరాల్లో ఆవిష్కరించిన మహాకవి

**డెస్క్, సెప్టెంబర్ 9 :**

తెలంగాణ ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9న ఘనంగా నిర్వహిస్తారు. తెలంగాణ సాహిత్యం, సంస్కృతి, ప్రజా ఉద్యమాల చరిత్రలో చెరగని ముద్ర వేసిన కాళోజీ 1914 సెప్టెంబర్ 9న జన్మించారు. ఆయన జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా అధికారికంగా జరుపుతూ భాషా, సాహిత్య రంగాలకు విశిష్ట గౌరవాన్ని అందిస్తోంది. ప్రజల జీవితాలను, వారి సమస్యలను, భావోద్వేగాలను తన రచనల్లో ప్రతిబింబించిన కాళోజీ తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కాళోజీ నారాయణరావు కేవలం కవి మాత్రమే కాదు, సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా ఉద్యమకారుడు కూడా. నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఆయన జీవితమంతా సామాజిక చైతన్యానికి అంకితమైంది. అన్యాయం, అసమానత, దోపిడీపై తన కలంతో పోరాడిన కాళోజీ ప్రజల గొంతుకగా గుర్తింపు పొందారు. తెలంగాణ మాండలిక భాషకు సాహిత్య గౌరవాన్ని తీసుకొచ్చిన ప్రముఖుల్లో కాళోజీ ఒకరు. ఆయన రచనలు పాండిత్య ప్రదర్శనకు కాకుండా ప్రజల మనసులను తాకే సరళమైన భాషలో ఉండేవి. సాధారణ ప్రజల మాటలను కవిత్వంగా మలచి సాహిత్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేశారు. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాలను తన రచనల ద్వారా సజీవంగా నిలిపారు. అందుకే ఆయనను తెలంగాణ ఆత్మగా పలువురు అభివర్ణిస్తారు. కాళోజీ రచించిన "నా గొడవ" తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట రచనగా గుర్తింపు పొందింది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ఆయన వ్యక్తం చేసిన ఆవేదన, ప్రజల పట్ల చూపిన నిబద్ధత ఈ రచనలో స్పష్టంగా కనిపిస్తాయి. కవిత్వాన్ని ప్రజల సమస్యలకు అద్దంగా ఉపయోగించిన కాళోజీ, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలిచారు. ఆయన రచనలు నేటికీ పాఠకులను ఆలోచింపజేస్తూనే ఉన్నాయి. సాహిత్యం, సమాజ సేవ రంగాల్లో చేసిన విశేష కృషికి గాను భారత ప్రభుత్వం కాళోజీకి పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. అనేక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నప్పటికీ ఆయన జీవితాంతం నిరాడంబరంగానే గడిపారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి స్వరం వినిపించడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. ప్రజా జీవితానికి అంకితమైన ఆయన వ్యక్తిత్వం అనేక తరాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. కాళోజీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యాసంస్థలు, సాహిత్య సంఘాలు, సామాజిక సంస్థలు ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రత్యేక సభలు నిర్వహిస్తాయి. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా భాషా పరిరక్షణ, మాతృభాష ప్రాధాన్యంపై చర్చలు జరుగుతాయి. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి కేవలం ఒక మహానుభావుడి జన్మదినం మాత్రమే కాదు, ప్రజల పక్షాన నిలిచిన ఒక గొప్ప వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకునే సందర్భంగా నిలుస్తోంది.

# పేదలకు అండగా సీఎంఆర్ చెక్కులు

**నందిగామ, సెప్టెంబర్ 09 :**



ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. నందిగామ మండలంలోని మొదల్లగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. పేద ప్రజలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో మందికి కొండంత భరోసానిస్తోందని నాయకులు తెలిపారు. వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ఈ చెక్కులు లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మొదల్లగూడ గ్రామానికి చెందిన పరకల ఇందిరమ్మ, పెద్దకుర్వ అమృతమ్మ, పయ్యావుల నవీన్ తో పాటు శ్రీనివాసులగూడ గ్రామానికి చెందిన లత తదితరులకు సీఎంఆర్ చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సిఫారసుతో ఈ చెక్కులను మంజూరు చేయించారు. లబ్ధిదారులు తమకు సహాయం అందించిన ఎమ్మెల్సీకి, ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టకాలంలో ఆదుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మొదల్లగూడ సర్పంచ్ పెంద్యాల అరుణ రాజు, శ్రీనివాసులగూడ సర్పంచ్ కుమ్మరి పద్మమ్మ క్రిష్ణయ్య, మొదల్లగూడ మాజీ సర్పంచ్ ఉమా ప్రవీణ్ రెడ్డి, మామిడిపల్లి మాజీ ఎంపీటీసీ కాట్న రవీందర్, శ్రీనివాసులగూడ మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మొదల్లగూడ ఉప సర్పంచ్ విక్రం రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు బీఆర్ఎస్ నాయకులు ప్రతాప్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మొయినోద్దీన్, రామచంద్రయ్య, కోరె రాజు, షఫీ, రమేష్ గౌడ్, జంగయ్య, నర్సిములు, ఆంజనేయులు గౌడ్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నియోజకవర్గంలోని పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించి సీఎంఆర్ నిధులను మంజూరు చేయిస్తున్నారని, దీని వల్ల ఎంతో మంది పేదలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. భారత రాష్ట్ర సమితి పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన ఉంటుందని, వారి సంక్షేమమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జంగయ్య, మురళి, శ్రీధర్ గౌడ్, దయాకర్ రెడ్డి, చింటు తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి సహాయం కావాలన్నా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మొత్తంగా నందిగామ మండలంలో జరిగిన ఈ సీఎంఆర్ చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానికంగా ఎంతో సందడిగా జరిగింది. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేస్తున్న సేవలను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పేదలకు మరింత చేరువ కావాలని నాయకులు ఆకాంక్షించారు.

# పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించిన జిల్లా యంత్రాంగం

**నారాయణపేట, సెప్టెంబర్ 09 :**




వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల తయారీలో వాడే కృత్రిమ రంగులు, రసాయనాల వల్ల జల వనరులు తీవ్రంగా కలుషితమవుతున్నాయని జిల్లా పాలనాధికారి సి. హెచ్ ప్రియాంక ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే కృత్రిమ రంగులతో చేసిన విగ్రహాల ను వదిలి మట్టితో చేసిన విగ్రహాలనే పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకో వడం మనందరి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణంపై అవగాహన కల్పిం చేందుకు రూపొందించిన మట్టి గణపతి ప్రచార చిత్రాలను జిల్లా పాలనాధికారి ప్రియాంక, జిల్లా పోలీసు అధికారి వినీత్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకృతికి హాని చేయని మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. భక్తితో పాటు బాధ్యత కూడా అవసరమని అన్నారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ అవగాహనలో భాగంగా ఎనిమిది అంగుళాల మట్టి గణపతులను అందించే కార్యక్రమాన్ని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్టి విగ్రహాలు త్వరగా నీటిలో కరిగిపోయి చెరువుల్లో పూడిక సమస్య రాకుండా చేస్తాయని, జలచరాలకు హాని కలగకుండా ఉంటుందని వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు. చెరువుల్లో పూడిక తొలగించడానికి, చెరువుల్లో పరిశుభ్రతను కాపాడడానికి వినా యక చవితి సందర్భంగా ప్రజలు, భక్తులు నడుం బిగించా లని పాలనాధికారి సూచించారు. మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేసి భక్తి శ్రద్ధలతో చెరువుల్లో నిమజ్జనం చేయవచ్చని, దీని వల్ల చెరువులు కలుషితం కాకుండా ఉంటాయని తెలిపా రు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా సంప్రదా యాన్ని, పర్యావరణాన్ని రెండింటినీ కాపాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పాలనాధికారి శ్రీను, పురపాలక సంఘ అధ్యక్షు రాలు కొండా శ్వేతా సత్య యాదవ్, ఉపాధ్యక్షురాలు మంజుల, పరిశ్రమల సంస్థ అధికారి అబ్దుల్ ఖలీల్, ఉప పోలీసు అధికారులు నల్లపు లింగయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే వాడేలా విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులు నిర్ణయించారు. మండల, గ్రామ స్థాయిలో కూడా అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని ప్రణాళిక రూపొం దించారు. పర్యావ రణ హితమైన పండుగ నిర్వహ ణకు ప్రజలందరూ సహక రించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# ఎమ్మెల్సీ వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రజలంతా చూశారు: మంత్రి

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :**



శాసనసభ స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వ్యవహరించిన తీరును రాష్ట్ర ప్రజలంతా గమనించారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బుధవారం శాసనసభలో జరిగి న చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన వీడియోల్లో జరిగిన పరిణామాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు ఆ ఎమ్మెల్సీని సమర్థిస్తూ మాట్లాడటం బాధాకరమని మంత్రి వ్యాఖ్యానించారు. "అలా అనుకుంటే, అలా భావించినట్లయితే" అంటూ ఘట నను తేలికగా తీసుకునే ప్రయత్నం చేయడం సమంజసం కాదని అన్నారు. స్పీకర్ పదవికి, శాసనసభ గౌరవానికి భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో రాజ్యాంగబద్ధ పదవులకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. మహిళా శాసన సభ్యులు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర విచారణ నిర్వహిస్తామని చెప్పారు. ఒకవేళ విచార ణలో పోలీసులు మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అమర్యాదగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. వాస్తవాలను వెలికితీసి న్యాయం జరిగేలా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహ రిస్తుం దని స్పష్టం చేశారు.

# ఉద్యోగాల వయోపరిమితి పెంచాలన్న విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :**



కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల భర్తీకి సంబంధించిన గరిష్ఠ వయోపరిమితిని పెంచాలని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కరోనా పరిస్థితులు, నియామక ప్రక్రియల్లో జరిగిన ఆలస్యాల కారణంగా అనేక మంది నిరుద్యోగులు అర్హత కోల్పోతున్నారని ఆయన వివరించారు. ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు సమయానికి వెలువడకపోవడం వల్ల వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా సిద్ధమవుతున్న అభ్యర్థులు అవకాశాలు కోల్పోయే పరిస్థితి నెలకొనడం ఆందోళనకరమని తెలిపారు. ఈ అంశాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం కానిస్టేబుల్ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి 34 సంవత్సరాలుగా ఉందని, దానిని 36 సంవత్సరాలకు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే ఎస్సై పోస్టులకు ప్రస్తుతం ఉన్న 37 సంవత్సరాల గరిష్ఠ వయోపరిమితిని 38 సంవత్సరాలకు పెంచాలని కోరారు. దీనివల్ల అనేక మంది నిరుద్యోగ యువతకు అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. కరోనా మహమ్మారి సమయంలో పోటీ పరీక్షలు, నియామక ప్రక్రియలు గణనీయంగా ప్రభావితమయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఆ కాలంలో అనేక మంది అభ్యర్థులు తమ అవకాశాలను కోల్పోయారని, ఈ నేపథ్యంలో వయోపరిమితి సడలింపు అవసరమని వివరించారు. నిరుద్యో గుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగుల అభ్యర్థనపై సానుకూలంగా స్పందించినట్లు బల్మూ ర్ వెంకట్ తెలిపారు. వయోపరిమితి పెంపు అంశానికి సంబంధించిన అన్ని కోణా లను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుం టామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం యువత ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుం టుందనే ఆశాభా వాన్ని వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాద నను పరిశీలించాలని బల్మూర్ వెంకట్ కోరారు. వయోపరిమితి పెంపు ద్వారా అర్హత కోల్పోయే అభ్యర్థులకు మరో అవకాశం లభిస్తుందని తెలి పారు. ఈ అంశంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# నోరా ఫతేహిపై రూ.3 కోట్ల దావా



**ముంబయి, సెప్టెంబరు 9 :**

బాలీవుడ్ నటి ఊహించని షాక్ తగిలింది. ఓ చార్టెడ్ విమానంపై ఆమె చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో డ్యాన్స్ ఏవియేషన్ సంస్థ నోరా ఫతేహిపై రూ.3 కోట్ల పరిహారం కోరుతూ దావా వేసినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం ప్రస్తుతం బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. సినిమాలతో పాటు ప్రత్యేక పాటలు, వేదిక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరిస్తున్న నోరా ఫతేహి ఇటీవల ఓ చార్టెడ్ విమానంలో ప్రయాణిం చాల్సి వచ్చింది. విమానాన్ని చూసిన ఆమె అది చాలా చిన్నగా, బొమ్మ విమానంలా ఉందంటూ సరదాగా వ్యాఖ్యలు చేస్తూ వీడియోను రికార్డు చేశా రు. అనంతరం ఆ వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాలో పోస్ట్ చేయగా అది వైరల్‌గా మారింది. అయితే నోరా చేసిన వ్యాఖ్యల వల్ల తమ సంస్థ ప్రతిష్ఠ దెబ్బతిందని డ్యాన్స్ ఏవియేషన్ ఆరోపించింది. ఆమె వీడియో కారణంగా తమ విమాన బుకింగ్‌లు 15 నుంచి 20 శాతం వరకు తగ్గాయని సంస్థ పేర్కొన్నట్లు సమాచారం. దీంతో నోరా ఫతేహిపై చట్టపరమైన చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. రూ.3 కోట్ల పరిహారం చెల్లించడంతో పాటు, వివాదాస్పద వీడియోను సామాజిక మాధ్య మాల నుంచి తొలగించాలని, సంస్థకు క్షమాపణ చెప్పాలని డ్యాన్స్ ఏవియేషన్ డిమాండ్ చేసినట్లు సమాచారం.




# ఐమ్యాక్స్ స్క్రీన్ల కోసం రామాయణ-గాడ్జిల్లా పోటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 9 :**

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో 'రామాయణ: పార్ట్ 1' ఒకటి. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, యష్ రావణుడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. భారీ విజువల్ గ్రాండియర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం 2026 నవంబరు 6న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. అదే తేదీన జపాన్‌కు చెందిన భారీ చిత్రం 'గాడ్జిల్లా మైనస్ జీరో' కూడా అంతర్జాతీయ మార్కెట్లలోకి రానుంది. 'గాడ్జిల్లా మైనస్ వన్'కు కొనసాగింపుగా తకాషి యమజాకి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు తాజాగా విడుదలైన ట్రైలర్‌తో అంచనాలు మరింత పెరిగాయి. దీంతో రెండు చిత్రాల మధ్య పోటీపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ పోటీకి మరో ప్రత్యేకత ఉంది. రెండు సినిమాలూ భారీ విజువల్స్, ప్రీమియం ఐమ్యాక్స్ అనుభూతిని దృష్టిలో పెట్టుకుని రూపొందుతున్నాయి. ముఖ్యంగా 'గాడ్జిల్లా మైనస్ జీరో'ను జపాన్‌లో ఐమ్యాక్స్ కోసం ప్రత్యేకంగా చిత్రీకరించిన భారీ చిత్రంగా ప్రచారం చేస్తున్నారు.

# ఓటీటీలోకి 'ఇరుముడి'

**హైదరాబాద్, సెప్టెంబరు 9 :**

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భావోద్వేగ కథా చిత్రం థియేటర్లలో మంచి విజయాన్ని అందుకుంది. రవితేజను మాస్ హీరోగానే కాకుండా భావోద్వేగభరితమైన పాత్రలో చూపించిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. 'నిన్ను కోరి', 'మజిలీ' వంటి భావో ద్వేగ కథలను తెరకెక్కించిన శివ నిర్వాణ.. రవితేజతో 'ఇరు ముడి'ని రూపొందించారు. కుటుంబ బంధాలు, తండ్రీకూ తుళ్ల అనుబంధం, ప్రేమ, భావోద్వేగాల చుట్టూ కథను నడిపించిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. రవితేజ, చిన్నారి నక్షత్ర మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని సినీ వర్గాలు పేర్కొన్నాయి.




# అసూయతోనే నా బ్రేకప్ - ఇనయా సుల్తానా



**హైదరాబాద్, సెప్టెంబరు 9 :**

నటి ఇనయా సుల్తానా తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. సినీ పరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నించిన సమయంలో ఎదురైన ఇబ్బందులు, చిన్న పాత్రలు చేయడానికి కూడా సిద్ధపడిన సందర్భాలను ఆమె గుర్తుచేసుకున్నారు. మీడియా తనకు ఎంతో సహాయం చేసిందని, మనుషులను హ్యాండిల్ చేయగల సామర్థ్యం తనకు ఉందని తెలిపారు. తన ప్రేమ వ్యవహారం గురించి మాట్లాడుతూ.. మాజీ ప్రియుడి అసూయ కారణంగానే బ్రేకప్ జరిగిందని ఇనయా సుల్తానా వెల్లడించారు. తనకు వస్తున్న గుర్తింపు, సినిమా అవకాశాలను అతడు తట్టుకోలేకపోయేవాడని చెప్పారు. ఒక వివాహ వేడుకలో అందరి ముందే తనను దుర్భాషలాడటంతో ఆ క్షణమే సంబంధానికి ముగింపు పలికినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలను ఎక్కువగా పంచుకోవడం వల్ల దిష్టి తగులుతుందని తాను బలంగా నమ్ముతానని ఇనయా చెప్పారు. అందుకే ఇటీవల ఫోటోషూట్‌లను తగ్గించానని, ప్రస్తుతం చేస్తున్న సినిమా ప్రాజెక్టుల వివరాలను కూడా బయటకు చెప్పడం లేదని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రయాణాల గురించి మాట్లాడుతూ.. ఇప్పటివరకు దుబాయ్, బ్యాంకాక్, శ్రీలంక, సింగపూర్, మలేషియా వంటి ప్రాంతాలకు మాత్రమే వెళ్లినట్లు తెలిపారు.



# నమ్మకంతో రూ.20 లక్షలు పోగొట్టుకున్న భాను శ్రీ

**హైదరాబాద్, సెప్టెంబరు 9 :**

బిగ్‌బాస్ భాను శ్రీ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. బుల్లితెరపై పలు కార్యక్రమాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న చేదు అనుభవాన్ని వెల్లడించారు. ఒక వ్యక్తిని పూర్తిగా నమ్మి రూ.20 లక్షలు కోల్పోయిన ఘటన తన జీవితంలో అత్యంత బాధాకరమైన అనుభవాల్లో ఒకటని భాను శ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇచ్చే సమయంలో ఎలాంటి పత్రాలు, రాతపూర్వక ఆధారాలు తీసుకోకపోవడం చివరకు తనకు తీవ్ర నష్టం కలిగించిందని ఆమె చెప్పుకొచ్చారు. భాను శ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె ఓ వ్యక్తికి రూ.20 లక్షలను నగదు రూపంలో ఇచ్చారు. ఆ వ్యక్తి మొదట దాదాపు రెండేళ్లపాటు ప్రతి నెలా మూడు శాతం వడ్డీ చొప్పున డబ్బులు ఆమె బ్యాంకు ఖాతాలో క్రమం తప్పకుండా జమ చేశారట. ఎలాంటి ఆలస్యం లేకుండా వడ్డీ డబ్బులు రావడంతో ఆ వ్యక్తిపై భాను శ్రీకి నమ్మకం మరింత పెరిగిందని తెలిపారు. తన అసలు పెట్టుబడి కూడా సురక్షితంగానే ఉందని భావించానని ఆమె పేర్కొన్నారు. అయితే రెండేళ్లు పూర్తయిన తర్వాత అసలు మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని అడిగిన సమయంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందని భాను శ్రీ తెలిపారు. తన రూ.20 లక్షలు తిరిగి ఇవ్వాలని కోరగా.. డబ్బులు ఇవ్వలేమని అవతలి వ్యక్తులు స్పష్టం చేసినట్లు ఆమె వెల్లడించారు. ఎందుకు ఇవ్వలేరని ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వకుండా.. డబ్బులు ఇవ్వలేమంటే ఇవ్వలేమంతే అన్నట్టుగా మాట్లాడారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇచ్చిన డబ్బును వాటా మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టామని, అందులో మొత్తం నష్టపోయిందని వారు చెప్పినట్లు భాను శ్రీ వివరించారు.



# 'ది ప్యారడైజ్' విడుదల తేదీ ఖరారు

**హైదరాబాద్, సెప్టెంబరు 9 :**

నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాపై మరో కీలక అప్‌డేట్ వెలువడింది. కొంతకాలంగా ఈ చిత్రం విడుదల తేదీపై పలు రకాల వార్తలు ప్రచారంలోకి వచ్చినప్పటికీ.. చిత్రబృందం మరోసారి విడుదల తేదీని స్పష్టం చేసింది. ముందుగా ప్రకటించినట్టుగానే 2026 సెప్టెంబరు 24న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు వేగం పుంజుకుంటున్నాయి. మరోవైపు అమెరికాలో 'ది ప్యారడైజ్'కు సంబంధించిన ముందస్తు టికెట్ విక్రయాలు ప్రారంభమయ్యాయి. విక్రయాలు మొదలైన కొద్ది గంటల్లోనే భారీ స్పందన రావడం విశేషంగా మారింది. సమాచారం ప్రకారం ఇప్పటివరకు అమెరికాలో ముందస్తు విక్రయాల ద్వారా 50 వేల డాలర్లకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. విడుదలకు ఇంకా సమయం ఉండగానే ఈ స్థాయిలో స్పందన రావడం చిత్రంపై నెలకొన్న అంచనాలను తెలియజేస్తోంది. నాని సినిమాలకు అమెరికాలో మంచి ఆదరణ ఉండటంతో 'ది ప్యారడైజ్' విషయంలోనూ అక్కడి పంపిణీ వర్గాలు భారీ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు టికెట్ విక్రయాలకు వస్తున్న స్పందన ఇదే స్థాయిలో కొనసాగితే రానున్న రోజుల్లో విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా నాని మార్కెట్‌తో పాటు సినిమాపై ఇప్పటికే ఏర్పడిన భారీ ప్రచారం అమెరికా వసూళ్లపై ప్రభావం చూపుతుందని అభిమానులు భావిస్తున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467